# వింత మనస్తత్వాలు

"ఏమండీ వదినగారూ! రాత్రి ఒంటిగంటవరకూ దాస్తేనేగాని ఆ ఆఫీసు కాగితాలు తరగవట—అంచేత టీ పెట్టమన్నారాయన. ఓ మారు పొయ్యిముట్టిస్తారా?" అంది రాజ్యం తన ఆడబొట్టి శాంతతో.

ఇక ఆ రోజున తను చేయవలసిన పని పూర్తయిందనుకొని పడుకుంది శాంత. తన జీవితంలో విచారంలేకుండా గడపగలిగేకాలం ఒక్క సుఖనిద్ర పట్టినప్పుడే- అలాంటి నిద్రకూడా ఏనాడోగాని పట్టదు. ఒక వేళ నిద్ర పట్టినప్పటికీ ఏవేవో భయంకరమైనకలలూ అవీనూ—ఆరోజైనా సుఖంగా నిద్రపడుతుందేమోనన్న ఆశతో అంతవరకూ పనిచేసి అప్పుడే పడుకుంది శాంత.-

కాని అంత వేగం తను పడుకోడానికి వీల్లేదని ఆమె తెలుసుకుంది! అప్పుడు లేచి నిప్పంటించి 'టీ' తయారు చెయ్యాలి. 'ఏం? ఆ మాత్రంపని అది చేసుకోలేదూ? ఆ పనికే తననే లేపాలా?' అని మనస్సులో అనుకుంటూ మెల్లిగా లేచింది శాంత!...

..."అలానే. అంటిస్తానమ్మా-నువ్వుపోయిపడుకో-" అంది శాంత అమాయకంగా;

అమాయకత్వమూ, అభిమానమూ తనచుట్టూ గూడుకట్టుకు పోయాయన్న సంగతి శాంతకు తెలుసు!

ఒక్కొక్కప్పుడు ఆ రెండింటివల్లా తన కెంతో బాధకలుగు తుందన్న విషయంకూడా ఆమెకు తెలుసు! "నే నిప్పుడు చెయ్యలేను. నువ్వే పోయి చేసుకో!" అని అంటే, రాజ్యం తనను చేయగలిగే దేముంది?...ఊహుఁ–అలా అనడం తనకు చేతకాదే!...

...ఇంతకీ రాజ్యంకూడా పట్టి అమాయకురాలని శాంత ఉద్దేశం! తనను బాధలుపెట్టాలనే తలంపు రాజ్యాని కే కోశానా లేదని శాంత విశ్వాసం!...ఆమె జీవితపుచేదుని రుచి చూడలేదు!...తను ఏనాడో జీవితపుచేదుని రుచి చూసింది! కష్టాలనే కవచం తనహృదయం చుట్టూ కప్ప బడింది. అంచేత తనకు కష్టాలంటే అంతగా భయం లేదు. కష్టాలంటే యేఁవిటో తెలియని రాజ్యాన్ని కూడా తనతోపాటు కష్టపెట్టడం ఎందుకు ?...ఊహుఁ ... రాజ్యం సుఖంగాఉండడమే తనకు కావలసింది !... తనహృదయం ఏనాడో స్పర్శజ్ఞానాన్ని కోల్పోయింది!... కష్టాలన్నా, సుఖాలన్నా ఒక్కలాగేఉంటాయి తనకు. ఇంతకీ తను కష్టపడుతున్నది ఏమిటిమహా!...తన అన్న య్యకు సేవచెయ్యడం ఓ కష్టమా?...అని ఏమేమో ఆలో చించుకుంటూ పొయ్యి అంటించి నీళ్ళు దానిమీదపెట్టింది శాంత.

దీనత్వంచే వరింపబడ్డ శాంతమూర్తిలా వంటింటిలోకి పోయి పొయ్యి అంటిస్తూన్న వదినెగారివేపు ఆట్టే నిర్ఘాంత పోయి చూసింది రాజ్యం!...రాజ్యంహృదయంలో ఏ

మూలనో చెప్పలేని బాధ ప్రారంభమైంది. తనగదిలోకిపోయి మంచంమీద పడుకుంది.

గోడమీది గడియారం "టంగ్ టంగ్" మని పదిగంటలు కొట్టింది. త్రుళ్ళిపడింది రాజ్యం - పగలల్లా కష్టపడి, రాత్రి తొమ్మిదిన్నర అయేవరకూ యింటెడుచాకిరీ తనే చేసింది ఒక్కర్తే!...అలసిపోయి ఇక నిద్రపోదామని పడుకుంది!...అలాంటప్పుడు తను ఆమెనిలేపి 'టీ' పెట్టమనడం ఏమంత సబబుగా వుంది?...ఆమాత్రం పనికోసం ఆమెనే లేపాలా? తమందరికీ చెయ్యడానికి ఆమె కేం పట్టింది?—ఆమెభర్తే బ్రతికుంటే అలా లేమింటికిచేరి, చాకిరీ చెయ్యవలసే ఆవశ్యకత ఆమె కేముందో?...పోనీ యిప్పుడు మాత్రం?—ఆమె అన్నయ్యదగ్గరుండి ఆమె ఆ మాటకొస్తే తనే ఆమెకూ ఆమె అన్నయ్యకూ సేవచెయ్యడం సబబు! అదీగాక, తన భర్తయొక్క ఉద్యోగం పోవడానికి సిద్ధంగా ఉన్నప్పుడు కాపాడిం దెవరు?..."శాంత! శాంత !!" అని నాలుగుగోడలూ అరచినట్టు అనిపించింది రాజ్యానికి! ...నిజానికి ఆమె అప్పట్లో ఆ నాలుగు వేల రూపాయలూ యివ్వకపోతే తమ గతేం కావలసింది!—భిక్షాపాత్ర చేతిలోకి రావలసిందే కదూ!...

మెళ్ళో గలగలలాడే గొలుసు చేతికి తగిలింది! అదెవరిచ్చారు?...శాంతకదూ! ఆమెజీవితంలో వసుపుకుంకుమక్కీ, వసువాహనాలక్కీ అర్హురాలు కాకపోబట్టేకదూ అవి తనకు దక్కాయి! ఏం? ఆమె తనతోనే సంబంధంలేకుండా మరో ఊళ్ళో హాయిగా అక్కయ్యకొడుకు నౌకర్ని పెంచుకొని

ఆ డబ్బుతో కాలక్షేపం చేసుకోలేక తమింటికి వచ్చిందా? ఊహుఁ!...అన్నయ్య అంటూ ఉండగా మరొకదగ్గరుండడం దేనికని వచ్చింది. అంతేగాని, గడవక రాలేదు. మరి అలాం టప్పుడు ఆమెడబ్బు తింటూ ఆమెచేతనే చాకిరీచేయించుకో డం ఏంన్యాయంగా ఉంటుంది? అలా ఆ విషయాలను గురించి చాలాసేపు రాజ్యం బుర్ర వేడెక్కేలా ఆలోచిం చింది. ఆఖరికి ఒకనిట్టూర్పు విడిచింది!

వదినెగారిచేత అలా పనిచేయించుకోడం ఏమంత న్యాయమైన పని కాదనే తీర్మానానికి వచ్చింది రాజ్యం. శాంతను సుఖపెట్టాలి. ఆమె సేవే తనూ, భర్తాకలిసి చెయ్యా లనుకుంది...పాపం! శాంత తనజీవితంలో ఏమానందాన్ని అనుభవించింది? మాతృశ్రీ కాలేకపోయింది సరికదా, నులి వెచ్చని ముద్దులలోగల మాధుర్యాన్నిమాత్రం ఏమంతగా రుచిచూసింది!...అమ్మయ్యో!...ఆమెపరిస్థితి తల్చుకుంటే గుండె చెక్కలవుతుంది!–ఆమె యింకా ఎలా జీవించగలిగి ఉందో? తనూ ఒకప్పుడు అలాంటిపరిస్థితిలోకివస్తే?...అని రాజ్యం మనస్సులో ఓ భయంకరమైన ప్రశ్న! ఆ విషయం తల్చుకోగానే రాజ్యంహృదయం భీతితో ముకుళించుకు పోయింది! చుట్టూ గోడలమీదఉన్న దేముళ్ళపటాలవేపు చూసింది! ఆ పరిస్థితి పగవారికికూడా రాకుండా ఉండాలని అందరిక్కీ నమస్కారాలు పెట్టింది!

మళ్ళీ శాంతను తల్చుకుంది. వంటింట్లోకివెళ్ళి ఆమెకు సహాయం చెయ్యాలనుకుంది. ఆమె శాంతస్వభావాన్ని చూస్తే ఓ రకంగా అసహ్యం వేస్తూంది రాజ్యానికి. 'పని

చేయలేనని' ఆమె యెప్పుడూ అనదేం!—అలాఅంటే ఎంత బాగుండిపోయేది? నిజానికి లోలోన పనిచెయ్యడానికి కష్ట పడుతూన్నప్పటికీ పైకిమాత్రం మహాసంతోషంతో పనిచేస్తు న్నట్టు నటిస్తుంది. పైగా తనొకవేళ పనిచెయ్యడానికి పూను కుంటే ఒద్దని వారిస్తుందికూడా! ఏమిటో?...ఆమె మనస్తత్వం ఏమీ అర్థంకావడంలేదు రాజ్యానికి!—

ఇంతకీ ఆరోజున తనదే బుద్ధితక్కువ. ఆ కాస్త టీ నీళ్ళు పెట్టడానికీ పడుకున్న ఆమెను లేపాలా?...తను పెట్ట లేదూ? ఏమయినా తనదే బుద్ధితక్కువ అనే నిర్ణయాని కొచ్చింది! పోనీ అప్పుడైనా వెళ్ళి శాంతకు సహాయం చేద్దా మనే నిర్ణయానికొచ్చింది. మంచంమీదినించి లేచింది—

—కానీ అంతట్లోనే శాంత గుమ్మంలోనికివచ్చి, "ఇంకా మేలుకునే వున్నావుటే రాజ్యం!...పడుకో! చాలా రాత్రయింది. అన్నయ్యకు టీ యిచ్చేసేనులే!" అని వెనక్కి తిరిగి బరువుగా అడుగులు వేస్తూ తన మంచంవున్న గదివేపు వెళ్ళిపోయింది!

అంత త్వరగా శాంత టీ తయారుచేస్తుందని అనుకో లేదు రాజ్యం!...తీరా తను సహాయం చేద్దామనే నిర్ణయాని కొచ్చేసరికి ఆమె పనే పూర్తిచేసింది! ఇంక తను శాంతను సుఖపెడదామనే నిశ్చయం యీ నిశ్చయంలాగ కాకుండా సవ్యంగా నెరవేరడానికి తోడ్పడమని కోరుకుంటూ మరో మారు దేవుళ్ళకు దండాలుపెట్టింది. అతిప్రయత్నంమీద కళ్ళు మూసుకొని పడుకుంది ఆఖరికి!

"ఏం శాంతా!...ఇంతలా నీరసంగా ఉన్నావేం?" అంది కొళాయిదగ్గర పొరిగింటి సావిత్రమ్మ.

"మామూలుగానే ఉన్నానే" అంది శాంత ఆశ్చర్యంగా.

"లేదు శాంతా!...చాలా నీరసంగా ఉన్నావు" అని మళ్ళా పల్లవిలోకివచ్చింది సావిత్రమ్మ!

"ఈమధ్య చాలా వేడి చేసినట్టుంది. అంచేతేమో!" అంది శాంత ఏదో కారణం చెప్తేనేగాని వదిలేటట్టు లేదని!

"ఊహుఁ!... నేను నమ్మను!-నువ్వు అసలువిషయం దాస్తున్నావు!...ఉదయం లేచినదగ్గర్నుంచీ మళ్ళా రాత్రి పడుకునేవరకూ చాకిరీఅంతా నువ్వే చెయ్యాలి కదూ?" అంది సావిత్రమ్మ గొప్పవిషయాన్ని కనిపెట్టినట్టు!

"ఆ ఊసు ఇప్పుడెందుకుం?" అంది శాంత కాస్త చిరాకుతో!...

"ఎందుకూలేదు! పనంతా నువ్వే చెయ్యడాన్న యిలా నీరసంగా ఉన్నావేమోనని!"

"బాగుంది. పనిచేసినంతమాత్రంలో నీరసంగా ఉంటారేఁవిటి? ఎంతమంది పనులుచేసుకుంటూ దుక్కల్లా ఉండడంలేదు? మరి రోజంతా కష్టపడి పనిచేసేకూలీలు నీరసంగా ఉన్నారంటావేమిటి?" అంది శాంత.

"ఆ విషయం పరిస్థితినిబట్టి ఆధారపడుంటుంది. శాంతా! ... దేహమనోవ్యాపారాలకు పరస్పరసంబంధం

వుంటుంది! నీ అదృష్టరేఖ బాగులేకపోవడంవల్ల మానసికంగా బాధపడడం సహజం!...దానిమీద ఇంటెడిచాకిరీ నువ్వే ఒక్కర్తెవీ చెయ్యడం!—మరి యిలా తయారయేవంటే ఏమాత్రమైనా ఆశ్చర్యంవుందా?—ఔనుగానీ, మీ అన్నపెళ్ళాం అలా దర్జాగా రాణీలాగ కూర్చుంటుందే కానీ, ఒక్క పిసరైనా నీకు సాయం చేస్తున్నదీ?... నిజం చెప్తావా?"

"అదేం సాయం చెయ్యగలదమ్మా చిన్నపిల్లామె?"

"ఓహో!...నాకు తెలీనట్టే చెప్తున్నావు! నీ కన్నా ఏమాత్రంచిన్నది చెప్పు?? మహాఅయితే రెండేళ్ళు చిన్నదై వుంటుంది! అంతేకదూ?" అని యింకా 'రీజన్' తీస్తూ అంది సావిత్రమ్మ!

"కష్టాలను బాగా అర్థంచేసుకున్న అనుభవజ్ఞురాలను నేను! పాపం కష్టంఅంటే యేమిటో రుచిచూడని అమాయకురాలు రాజ్యం!—నా కెలానూ యీ జీవితంలో సుఖమనేది లేదు - మరి ఇక నేను దర్జాగా యింట్లో కూర్చొని ఆమెని కష్టపెట్టడమా?...ఊహు!..." అంటూ కంట తడిపెట్టింది శాంత.

"ఔనమ్మా, ఇంతకీ అదృష్టం ఉండాలి. అన్నట్టు నీ డబ్బుసంగతి మరి?...ఆ సమయంలో నువ్వు లేకపోతే నీ అన్నయ్యా పెళ్ళాం ఏం కావలసిందీపాటికి చెప్పు?...ఆఖరికి నీ డబ్బుతిని నీచేతే చాకిరీ చేయించుకుంటున్నారమ్మా!" అంది సావిత్రమ్మ మహా అభిమానం శాంతమీద దొర్లుకొచ్చినట్టు

"నాకు పిల్లలా యేమన్నానా?...నేనా డబ్బునుంచు కొని ఏం చేసుకునేది? ఏదో రాజ్యం కులాసాగావుండి ఓ మాతృశ్రీ అనిపించుకుంటే, ఆ పిల్లలనే నా పిల్లలనుకుం టాను—ఇక నే వెళ్తాను. అన్నయ్య ఆఫీసునుంచి వచ్చుం టాడు!" అంటూ బిందెను భుజంమీాది కెత్తుకుంది శాంత!

శాంత ఎంతో శాంతస్వభావం గలదనీ, ఆమె గనక ఆ యింట్లో ఉండగలుగుతున్నదనీ, మరొకరైతే ఉండలేరనీ, రాజ్యం వట్టి గయ్యాళిగంప అనీ, ఇంటెడుచాకిరీ శాంతకే పులిమేసి తను దర్జాగా రాణిగారిలాగ కూర్చుంటుందనీ, శాంతడబ్బుతింటూకూడా ఆమెని దాసీలాగ తయారుచేస్తు న్నారనీ, తనఉద్యోగం కాపాడి, భిక్షపెట్టినవిశ్వాసంలేకుండా ఆమెఅన్న ఆమెను హీనంగా చూస్తున్నాడనీ—ఈ విషయా లన్నీ శాంతే అందరితోనూ చెప్పి ఏడుస్తున్నట్లు లోకంలో ఒక అలజడిబయలుదేరింది! సావిత్రమ్మే యీా 'ప్రాపగాండా' చేసిందని శాంతకు తెలుసు!...

లోకం తనపట్ల అలా సానుభూతినీ, రాజ్యంపట్ల అలా అసహ్యతను చూపెట్టడం అనేది ఆ పరిస్థితిలో. ఎంతో కష్టం కలిగించింది శాంతకు! ఇద్దరిపట్లా ఆ సానుభూతిని చూపెడితే ఎంత బాగుండిపోయేది! ఒకరిపట్ల సానుభూతి ఇంకొకరిపట్ల ద్వేషమూానూ!...ఇంతకీ తనేమంతకష్టాలనుభ విస్తున్నదని తనపట్ల సానుభూతిచూపడం? తన కిష్టంలేకుండా తను వాళ్ళకి చాకిరీ చెయ్యడంలేదే!...తను హృదయ పూర్వకంగా వాళ్ళకి చాకిరీ చేస్తున్నదే! మరైతే తనకులేని బాధ యీా లోకాని కెందుకూ?...తనపట్ల సానుభూతి

చూపితే తనకు సంతోషం కలుగుతుందనా లోకం ఉద్దేశ్యం? కాని అలా తనపట్ల సానుభూతిని చూపెట్టడం, రాజ్యం పట్ల అసహ్యాతను చూపెట్టడంవల్ల ఏర్పడ్డ విచిత్ర పరిణామంవల్ల తనెంత బాధపడుతున్నదో లోకానికేం తెలుసు?—ఇలాంటి అనవసరపు అలజడి ఎందుకొచ్చిందా అనే ఆలోచనపడింది శాంత. ఆమెకంతా అగమ్యగోచరమైంది పరిస్థితి.

ఆ అలజడి రాజ్యంహృదయంలో పెద్దగాయాన్ని ఏర్పరచింది. తనను అనవసరంగా 'గయ్యాళి' అన్నారు లోకులు. అందుకే ఆమెకా బాధ!...ఇంతక్రీ తనకా పేరు రావడానికి తనేం అంత గయ్యాళిపనులు చేసింది?—తను ఏ పని చేద్దామని చెయ్యిపెట్టినా "నువ్వెందుకమ్మా చెయ్యి చేసుకుంటావు?" అని తన వదినెగారు తానా పని మానేసే వరకూ ఒప్పుకోదే!...మరి అలాంటిమనిషీ ఊళ్ళోవాళ్ళతో అలా చెప్పి ఎందు కేడుస్తుంది!—శాంత మన స్తత్వం ఆమెకేమీ అర్థం కాలేదు....శాంత అలా తనమీద లోకంతో చెప్పి వుండదని రాజ్యం విశ్వాసం! కేవలం లోకంకూతలే అవని రాజ్యం వుద్దేశం!

కొన్నిరోజులు గడిచేయి. మరీమరీ హెచ్చుస్థాయిలో లోకులు రాజ్యాన్ని దూషించడం మొదలుపెట్టేరు. ఓసారి ఎదురింటావిడ రాజ్యం యింటికి వచ్చి ఏవేవో మాట్లాడిన పిమ్మట - "ఇక వెళ్తానండీ" అంది ... "ఇంకాంచెంసేపు కూర్చొని వెళ్ళండి" అంది రాజ్యం — "ఎలా వీలవుతుందండీ?—అవతల వంటకు వేళయిపోతూంది. మీకంటే

హాయిగా మీా వదినెగారు వండి పడేస్తారు. - ఎంతసేపైనా తీరుబడిగా కూర్చోగలరు మీారు. వెళ్తానండీ!" అందావిడ పోతూ పోతూ.

ఆ ఎత్తిపొడుపు మాటలు రాజ్యాన్ని ఎంతో బాధిం చేయి. ఊళ్లో ప్రతీవాళ్ళముందూ తాను అవమానపర్చ బడుతూంది. వదినెగారిచేత తను బలవంతాన పనిచేయిస్తు న్నట్టు లోకం చూస్తున్నది. అలా చెయ్యడానికి అవకాశం యిచ్చిన దెవరు?... తనే!... ముమ్మాటికీ తనే!... ఇక ముందు అలా మరి అవకాశం యివ్వకుండా ఉండేలా చేద్దా మనుకుంది రాజ్యం. కాని రాజ్యాన్ని పీడిస్తున్న ప్రశ్నలు కొన్ని ఉన్నాయి. శాంత ఆ యేడుపు తనదగ్గరే ఎందుకేడవ కూడదు?... లోకం ముందు యేడ్చి అలా తనకెందుకు అపఖ్యాతి తీసుకురావాలి? తనేం ఆమెని పని చెయ్యమని బలవంతం చేసిందా?... అని యేవేవో కొన్నిప్రశ్నలు రాజ్యాన్ని బాధించి శాంతమీాద అదివరకున్న గౌరవాన్ని పోయేటట్టు చేశాయి.

శాంతచేత ఏపనీ చెయ్యనివ్వకుండా అంతపనీ తనే చెయ్యడానికి పూనుకుంది రాజ్యం!... ఒకవేళ శాంత ఏపని చెయ్యడానికి పూనుకున్నా బలవంతాన ఆపని ఆమెచేత మానిపించేది. పైగా ఎత్తిపొడుపుమాటలుకూడా అనేది! "మీా డబ్బుతిని మీాచేతే చాకిరీ చేయించుకోడం ఏమైనా బాగుంటుందా? ఏదో బ్రతికున్నంతకాలం మాసేవ చెయ్యాక తప్పదు. అప్పటికీ మీా ఋణం తీర్చుకోలేము. ఇంతకీ మీాచేత చాకిరీ చేయించుకుంటే లోకం ఊరుకుంటుందా?" అని యీా

రకపు ఎత్తిపొడుపు మాటలని, మరింతగా శాంత హృదయాన్ని గాయపరచేది రాజ్యం.

లోకంలో ఒక్కొక్కప్పుడిలాంటి విచిత్ర పరిణామాలు ఎందుకొస్తూంటాయో? అర్థం అయిందికాదు శాంతకు!... రాజ్యంమనస్సు పూర్తిగా విరిగిపోయిందని శాంతకు తెలుసు! అందుకు కారణం లోకం తనకు లేని బాధ లోకానికి కలిగింది! తనపట్ల సానుభూతిని చూపేరు. కానీ, దానివల్ల వచ్చిన విచిత్ర పరిణామాన్ని లోకం గుర్తించలేదు!... ఆఖరికి అన్నయ్యకూడా తనని అపార్థం చేసుకున్నాడు! "ఇక రాజ్యమే అన్నిపన్లూ చేస్తుంది. నువ్వేపనీ చెయ్యొద్దు!... నువ్వు సుఖంగా ఉండడమే నాకు కావలసిందీని!... కాని నువ్వు లోకంముందు ఎందుకేడ్చేవు?... ఆ సంగతి నాతో చెప్పలేకపోయావా?" అన్నాడు.

కానీ అలా తనను ఇంట్లో తీరుబడిగా కూర్చోబెట్టడం వల్లే తను ఎంతో బాధపడుతున్నదన్న సంగతి వాళ్ళకేం తెలుసు?

ఆ బాధవల్లే శాంత మంచం పట్టడానికి ఆట్టేకాలం పట్టలేదు.

అలా శాంత మంచం పట్టడానికి కారణం తనే ఏమో అన్న అనుమానం రాజ్యానికి కలుగకపోలేదు. తనొక పెద్ద రాక్షసిలా ఆమెపట్ల ప్రవర్తిస్తున్నదా అని ఒక్కొక్కప్పుడు అనుకునేది. తన వదినెగారు, ఆమె భర్త చనిపోయిన తరువాత ఆనందంగా గడిపిన రోజు ఒక్కటైనా వుందా?

ఊహుఁ!... కానీ ఆమె అప్పటికన్నా పనిచేస్తూ ఇంట్లో అటూ యిటూ తిరుగుతూన్న రోజుల్లోనే హాయిగా ఉండేదేమో అన్న అనుమానం రాజ్యానికి కలిగింది. ఏమైనా ఆమె అప్పట్లోనే హాయిగా వుండేదన్న తీర్మానానికి వచ్చింది. న్యాయంగా ఆ పనిచేసేరోజుల్లోకన్నా యిప్పుడే హాయిగా ఉండడం సమంజసం!... ఎంచేతా అంటే ఆ పనిలోగల కష్టం రాజ్యం అనుభవపూర్వకంగా గ్రహించింది! అన్నాళ్లూ తను దర్జాగా రాణీగారిలాగా కూర్చుంది—అసలే భర్త చని పోయినందువల్ల దుఃఖంలో ఉన్న వదినెగారు పనినంతట్నీ ఎలా చేయగలిగేవారో!...భర్తతో కాలక్షేపంచేస్తూ ఆనం దంగాఉన్న తను ఆ కాస్త పనిచెయ్యడానికీ విసుగుకుంటు న్నదే!—మరి అలాంటిది ఆమె శారీరకంగా కష్టపడిందంటే మాటలా?...రాజ్యం మనస్సులో ఓ పెద్దకలవరం బయలు దేరింది... శాంత శాంతమూర్తి అని ఆఖరికి తేల్చుకుంది. శాంతమీద ఏదో చెప్పలేని దయ, అభిమానం హృదయం లోంచి కలిగింది రాజ్యానికి.

శాంత మనస్తత్వాన్ననుసరించి యికపై ప్రవర్తించా లనే నిశ్చయాని కొచ్చింది రాజ్యం! ఆమెకు పని చెయ్యాలని వుంటే చెయ్యనిస్తూ, తను కొంత సాయంచేస్తూ కాలాన్ని గడపాలనుకుంది. ఆమె మాటప్రకారమే యికముందు నడ చుకోవాలనుకుంది రాజ్యం.

తను చేసిన తప్పులకి క్షమాపణ కోరుకోడానికి శాంతవున్న గదిలోకి వెళ్ళింది రాజ్యం.

కానీ శాంత తనను క్షమించినదీ, లేనిదీ తెలుసుకో లేకపోయింది రాజ్యం. ఎన్నిసార్లు తట్టి లేపినా సమాధానం చెప్పలేదు. శాంతంగానే పడుకుంది శాంత!...

అప్పుడే గబగబా గదిలోకి ప్రవేశించాడు రాజ్యం భర్త! "రాజ్యం! మన అదృష్టం పండింది. రెండు వేల రూపాయిలు నాకు లాటరీలో వచ్చేయి. ఈ డబ్బు శాంతకే!... దానిపేరున ఓ యిల్లు కడదామనివుంది. చెల్లి నిద్రపోతున్న దేఁవిటి?" అన్నాడు శాంతమంచం వేపు చూస్తూ.

"జీవితంలో మన కవసరంలేనప్పుడు అన్నీ వస్తూవుం టాయి!" అని శాంత వేపు చూసి భోరున ఏడ్చింది రాజ్యం!

శాంత వేపుచూసి నిర్ఘాంతపోయేడా మెఅన్నయ్య. ఆందోళనతో డాక్టర్ యింటి వేపు పరుగెత్తేడు.

ఎలా తెలిసిపోయిందోగాని ఈగల్లాగ శాంత మంచం చుట్టూ మూగేశారు ఆ వీధివాళ్ళంతా. "ఎలాఅయితేనేం పొట్టను పెట్టేసుకుందమ్మా!" అన్నారు రాజ్యాన్ని ఉద్దేశిస్తూ కొందరు.

"లేని యేడుపు తెచ్చుకుంటున్నదమ్మా! అదంతా వదినగారిమీద అభిమానమే నంటావా?" అని యీరకంగా రాజ్యాన్ని ఉద్దేశించి ఆమెకి వినిపించేలా గుసగుసలాడు కున్నారు, రాజ్యాన్ని అర్థం చేసుకోలేని లోకులు!...

డాక్టరు వచ్చేడు. ఇంకా కొంచెం ప్రాణం వుంద న్నాడు. ఓ యింజక్షన్ యిచ్చేడు! బ్రతికేమాటయితే ఓ

మూడుగంటలలో తెలివివస్తుంది. లేకపోతే అంతే!" అని చెప్పి వెళ్ళిపోయాడు.

"ఈ వెధవింట్లో బ్రతికుండి ఆమె యేం సుఖిస్తుందమ్మా? ఇలా ప్రాణాలు విడిచేస్తేనే మంచిది!" అని మళ్ళీ లోకుల రిమార్కు.

శాంత బ్రతికినట్లయితే తన శరీరంమీద ఉన్న నగలన్నీ తిరుపతి వెంకటేశ్వర్లకు నిలువుదోపు యిస్తానని మ్రొక్కుకుంది రాజ్యం. తమ మనస్తత్వాలను అర్థం చేసుకోలేక అనవసరపు అపార్థాలను కల్పిస్తున్న లోకాన్ని చూసి అసహ్యించుకుంది రాజ్యం! శాంతకు ఎప్పటికైనా తెలివివస్తుందేమోనని కనిపెట్టుకొని కూర్చుంది రాజ్యం! అలా పన్నెండుగంటలసేపు కనిపెట్టుకొని కూర్చుంది!...

మరి తిరుపతి వెంకన్నకు నిలువుదోపు యివ్వవలసిన అవసరం తప్పిపోయిందని ఆ తరువాత తెలుసుకుంది రాజ్యం!

కథా నిలయం
2938
శ్రీకాకుళం